క్లుప్తంగా

కళాకారులకు ఆర్థికసాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయి పల్లిలో ఇటీవల రామాయణం స్టేజి నాటికను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ నాటక ప్రదర్శన ఖర్చుల నిమిత్తం శుక్రవారం ప్రోత్సాహక రూపకంగా రూ.5000 కళాకారులకు అందజేశారు. కనుమరుగవుతున్న కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మల్లేశ్, బాలస్వామి, చంద్రమౌళి, విజయ్, కుమార్, శేఖర్, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండికి చెందిన నిరుపేద జర్పుల సీత్యానాయక్‌కి గ్రామానికి చెందిన కేతావత్ కిషన్‌నాయక్ చేయూత నందించారు. శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీత్యానాయక్‌కు 25 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందించారు. భవిష్యత్‌లోనూ అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో అమర్‌సింగ్, తులసీరాం, భోని శంకర్, రమేష్, వినోద్, పరంసింగ్, సాయి, రవి తదితరులు ఉన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి కృషి

పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మంగను సన్మానించిన నాయకులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన బర్ల మంగ జగదీశ్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. శుక్రవారం రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి బర్ల మంగజగదీశ్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సారథ్యంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. మంగను సన్మానించిన వారిలో పట్టణ టౌన్ అధ్యక్షుడు ఆకుల ఆనంద్, పార్టీ నాయకులు మహేష్ గౌడ్, కప్పరి లక్ష్మయ్య, కప్పరి చందు, శ్యామ్‌లాల్, కిరణ్, రమేష్, భార్గవ్, రాజు, రవి కుమార్, మహేశ్ తదితరులున్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు: ఏఓ

ఆమనగల్లు: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ మహేంద్ర ఫర్టిలైజర్స్, సూర్య అగ్రిషాప్‌ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగులమందులకు సంబంధించిన ఇన్‌వాయిస్‌లు, బిల్లులు, రసీదు పుస్తకాలను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. షాపుల యజమానులు స్టాక్ రిజిస్టర్‌ను విధిగా ఎంట్రీ చేయాలని, రైతులకు విక్రయించే వాటికి సంబంధించి రసీదులు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, డీలర్లు జంగయ్య, సురేశ్ తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జి కమిషనర్‌గా చంద్రశేఖర్

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ప్రస్తుతం మీర్‌పేట కమిషనర్‌గా పనిచేస్తున్న బి.చంద్ర శేఖర్‌ను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డి.దివ్య శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డిపై ఇటీవల సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే.

నంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేస్తాం

ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్

మీర్‌పేట: నంబర్ ప్లేట్లు లేని వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.కాశీవిశ్వనాథ్ హెచ్చరించారు. రాచకొండ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్ పరిధి విరాట్‌నగర్ చౌరస్తాలో శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా ముందు, వెనకాల నంబర్ ప్లేటు సరిగ్గా ఉండేలా చూసుకోవాలని సూచించారు. నిబంధనల మేరకు ప్రతి ఒక్క వాహనదారు నంబర్ ప్లేటుతో తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని, లేకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. దాదాపు 50 వరకు వాహనాలను గుర్తించామని తెలిపారు.

అడుగంటిన మమత్‌ఖాన్ చెరువు

సాగు, తాగునీటికి ఇబ్బందులు | 200 బోర్లలో తగ్గిన నీటిమట్టం | తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్న అధికారులు



మమత్‌ఖాన్ చెరువు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్‌లో యాసంగిలో పంటలను సాగు చేసిన అన్నదాతల పరిస్థితి అగమ్య గోచరంగా తయారయ్యింది. గ్రామంలో దాదాపు 30 ఎకరాల విస్తీర్ణంలో గల మమత్‌ఖాన్ చెరువు ప్రస్తుతానికి పూర్తిగా ఎండిపోయింది. ఈ చెరువు కట్ట తెగి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ శాశ్వత ప్రాతిపదికన కట్ట నిర్మాణం చేపట్టలేదు. ఎప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారు. రూ.4 లక్షలతో 'యూ' ఆకారంలో తాత్కాలికంగా బండ్ నిర్మాణం చేపట్టి చేతులు దులుపుకున్నారు. పైగా కట్ట ఎత్తు తగ్గించారు. దీంతో చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గడంతో భూగర్భజలాలు అడుగంటాయి.

తూం మూసివేయడంతో..

చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెంచడం కోసం 20 ఏళ్ల క్రితం చెరువు తూం మూయించివేశారు. దీంతో చెరువు నీటినిల్వ సామర్థ్యం పెరిగి అప్పట్లో 80 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందింది. సుమారుగా 300 బోర్లలో నీటిమట్టం పెరిగడంతో పాటు వ్యవసాయ రంగం గణనీయంగా అభివృద్ధి సాధించింది. రైతులు సంవత్సరానికి రెండు పంటలను పండించుకునేవారు. ఈ చెరువుకు పైన ఉన్న వాగులు, కుంటలు, చెరువుల నుంచి వర్షపు నీరు ప్రవహించడానికి పాటు కాలువ ఉండేది.

18 ఎకరాలకు పరిమితం..

ప్రస్తుతం పాటు కాలువ కనుమరుగైంది. చెరువు అయకట్టు ప్రస్తుతం 18 ఎకరాలకే పరిమితమైంది. అయితే ఆ 18 ఎకరాలకు కూడా సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. చెరువు ఎండిపోవడంతో చుట్టు పక్కల సుమారుగా 220 నుంచి 250 బోర్లల్లో నీటి మట్టం తగ్గింది. ఫలితంగా బోర్లు ఆపి ఆపి పోయడంతో సాగులో ఉన్న వరి, మొక్కజొన్న తదితర పంటలు ఎండిపోయాయి. సుమారుగా 220 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి శాశ్వత ప్రాతిపాదికన కట్ట మరమ్మతు పనులు చేపట్టడం, పాటు కాలువను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

పంటలు ఎండిపోతున్నాయి



మమత్‌ఖాన్ చెరువు ఎండిపోవడంతో పరిసర ప్రాంతాల్లో దాదాపు 200 ఎకరాల్లో సాగుచేసిన పంటలు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. నీరు లేకపోవడంతో పశుపోషణ భారమై పశువులను కోబరాలకు తరలించే పరిస్థితి నెలకొంది. చెరువు కట్ట తెగి నాలుగు సంవత్సరాలవుతున్నా శాశ్వత చర్యలు చేపట్టలేదు. వెంటనే కట్ట నిర్మాణం చేపట్టాలి.

- కృష్ణగౌడ్, రైతు సంఘం నేత, దేవుని పడకల్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



ఇబ్రహీంపట్నం: కరెంట్ తీగల మరమ్మతుల నేపథ్యంలో సీతారాంపేట, అంబేద్కర్‌నగర్ ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వివేకానంద కాలనీ, సిరిపురం కాలనీ, చైతన్యనగర్, భాగ్యనగర్ కాలనీ, సీతారాంపేట్, అర్కేడియా, అంబేద్కర్ నగర్, పిర్జాద్ మహల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఆక్టోపస్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు వినోభానగర్, ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్ 3వ బెటాలియన్, సోషల్ వెల్ఫేర్ స్కూల్, దివ్య టెక్స్‌టైల్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ పంపిణీని నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులను సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

ఆదిబట్ల సబ్ స్టేషన్ పరిధిలో..

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జయన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సాయితేజ అపార్ట్‌మెంట్, వసంత కార్పొరేషన్, సాయితేజ ఎలైట్, రొచిస్మతి అపార్ట్‌మెంట్, సాయికుటీర్, ఎస్ఆర్ జూనియర్ కళాశాల, శ్రీశ్రీ ఏరోసిటీ, శ్రీచైతన్య కళాశాల టీసీఎస్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ స్టేషన్ పరిధిలో..

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ స్టేషన్ పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ విద్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మరియు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అబ్దుల్లాపూర్‌మెట్, బీసీకాలనీ, లష్కర్‌గూడ, ఓఆర్ఆర్, మైత్రీ గోకులం-1,2, నిత్యాఎవెన్యూ, న్యూలైఫ్ విల్లాస్, ఇనాంగూడ, యశోదనగర్ కాలనీ, కార్తీక్ హోమ్స్, ఆర్టీసీ కాలనీ, జయశంకర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నేడు రైతు అవగాహన సదస్సు

మంచాల: మండల పరిధిలోని నోములలో వానాకాలం పంటల సాగుపై శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి జ్యోతి శ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు నోముల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించే ఈ సదస్సులో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని గౌరెల్లిలోని లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని గురువారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా పూజారులు ప్రవీణ్, నవీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివార్లకు తలంబ్రాలు సమర్పించారు. అనంతరం తీర్థ ప్రసాద, అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బింగి దేవదాసు గౌడ్, ఎంపీటీసీ గ్యార బాలలింగస్వామి, మాజీ సర్పంచ్ చెట్టిగారి ఆంజనేయులు గౌడ్, మాజీ ఉప సర్పంచ్‌లు వెంకటేశ్ యాదవ్, చంద్రశేఖర్ వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్‌పై రైతుల ఫిర్యాదు

చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌కు మొర



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నేదునూరు గ్రామస్తులు

కందుకూరు: ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్ ఏర్పాటు చేయడంతో పాటు కాలువ, రోడ్డును సైతం ఆక్రమించుకొని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని నేదునూరు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డితో పాటు డీపీఓకు శుక్రవారం గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ రెవెన్యూ సర్వే నంబర్లు 646 నుంచి 648, 651 నుంచి 652, 655లలో 72 ఎకరాల భూమిని విద్యుత్ ఉద్యోగులు సొసైటీగా ఏర్పడి కొనుగోలు చేశారన్నారు. అట్టి భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా విద్యుత్ స్తంభాలు నాటి రోడ్లు వేస్తూ భారీ వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనికి తోడు చెరువులోకి వర్షం నీరు వెళ్లేలా ఉన్న కాలువతో పాటు పొలాలకు వెళ్లే రోడ్డును కొంత మేర కబ్జా చేశారన్నారు. ఆ విషయంపై పొలం కొన్న ఉద్యోగులకు గ్రామస్తుల మధ్య వాగ్వాదం జరుగుతుందన్నారు. తాము రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులమని మమ్మల్ని ఏమీ చేయలేరంటూ రైతులపైనే దురుసుగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. అధికారులు దర్యాప్తు చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రాకేష్‌గౌడ్, వెంకటయ్య, రవిగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణనాయక్, మైసయ్య, యాదయ్య, రాములు, డి.రాములు, జంగయ్య, చంద్రయ్య, నాగరాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

ఏఈకి కొత్తపల్లి గ్రామస్తుల వినతి



ఏఈకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

యాచారం: వర్షాలు కురుస్తున్న దృష్ట్యా తెగిపోయిన విద్యుత్ తీగలు, ఓపెన్ ట్రాన్స్‌ఫారమ్‌ల వద్ద ఫెన్సింగ్ తదితర పనులను వెంటనే చేపట్టాలని కొత్తపల్లి గ్రామస్తులు శుక్రవారం విద్యుత్ ఏఈ సందీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆన్, ఆఫ్ సిస్టమ్ లేదని తెలిపారు. గ్రామంలోని పలు కాలనీల్లో చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉన్నాయని తెలిపారు. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందినట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ జగన్, మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

వరద కాలువ నిర్మాణానికి సహకరిస్తాం

మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్

వనస్థలిపురం: 'ఏటేటా అదే తంతు' శీర్షికన శారదానగర్‌లో ముంపు సమస్యపై శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందన వచ్చింది. శారదానగర్ లో వరద కాలువ నిర్మాణానికి భూయజమానులు అడ్డుపడుతున్నారని, దీంతో కాలనీ వాసులకు వరద సమస్య తప్పడం లేదని కథనంలో 'సాక్షి' లో పేర్కొంది. ఈ కథనానికి భూయజమానులలో ఒకరైన హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్, బీజేపీ నాయకుడు సామ ప్రభాకర్‌రెడ్డి స్పందించారు. శారదానగర్ దిగువన వరద కాలువ నిర్మాణానికి భూమి యజమానులమైన తనతో పాటు తన సోదరులు రంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి గతంలోనే మున్సిపల్ అధికారులకు అంగీకార పత్రం ఇచ్చామన్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా స్థానిక కార్పొరేటర్, మున్సిపల్ అధికారులు తగిన ప్రణాళికతో ముందుకు వస్తే సంబంధిత పత్రాలు అందజేసి వరద కాలువ నిర్మాణానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. కాలనీవాసులు సైతం రాజకీయాలకు అతీతంగా ఈ విషయంలో తమ వద్దకు వస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- తడిసిన ధాన్యాన్నీ కొనాల్సిందే
- ఎంపీపీ కొప్పు సుకన్య



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనాల్సిందేనని ఎంపీపీ కొప్పు సుకన్య అధికారులకు సూచించారు. యాచారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చిన వెంటనే కొనుగోలు చేస్తున్నారా.. తడిసిన ధాన్యం పేరుతో ఇబ్బందులు గురి చేస్తున్నారా.. ధాన్యం విక్రయించినవారికి డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయా, కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు ఉంటున్నాయా... తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు పెడుతున్నారని, తేమ పేరుతో త్వరగా కొనుగోలు చేయడం లేదని ఎంపీపీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనాల్సిందేనని సర్కార్ చెబుతుంటే మీకు అభ్యంతరమేంటి అని అధికారులను నిలదీశారు. ధాన్యం మొత్తం కొనుగోలు చేయకపోతే ఆందోళన చేపడతామన్నారు. అనంతరం యాచారంలోని వన నర్సరీని ఎంపీపీ సందర్శించారు. వర్షాలు కురిసే లోపు ఉపాధి కూలీల ద్వారా గుంతలు తీయించాలని ఈజీఎస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్, యాచారం పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

కూలీలకు పే స్లిప్పులు అందజేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జగన్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

యాచారం: ఉపాధి పనులు చేసిన కూలీలకు పే స్లిప్పులు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని మాల్ గ్రామంలో శుక్రవారం ఉపాధి పనుల వద్దకెళ్లి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులు నింబంధనలు సక్రమంగా పాటించకపోవడంతోనే ఉపాధి పనులకు వెళ్లాలంటే కూలీలు ఆసక్తి చూపడం లేదని అన్నారు. కూలీలకు బిల్లులు ఇవ్వకూడదనే ఉద్దేశ్యంతోనే అధికారులు పేస్లిప్పులు సకాలంలో ఇవ్వడం లేదని అన్నారు. కూలీలు ఉపాధి పనులు చేసి నెలలు గడిచినా కూడ బిల్లులు రాకపోవడంతోనే పస్తులుండాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు సౌకర్యాలు కల్పించడం లేదు, ఉపాధి పనులు చేసే ప్రాంతాలు గ్రామాలకు చాలా దూరంలో ఉండటంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రైవేట్ వాహనాల్లో అద్దెలు చెల్లించి పనులకు పోతున్నారని అన్నారు. ఉపాధి కూలీల సమస్యలపై శనివారం మాల్ గ్రామ పంచాయతీ ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. అంతకు ముందు డీఆర్‌డీఓ శ్రీలత, యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి కూలీల సమస్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, నాయకులు..యాదయ్య, ఇందిరమ్మ, సాయిలు, పర్వతాలు, శేఖర్, వెంకటయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

ఉద్యాన శాఖ అధికారిణి కనకలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కనకలక్ష్మి

మాడ్గుల: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో దాదాపు 5,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుచేసే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని ఉద్యాన శాఖ అధికారిణి కనకలక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని బ్రహ్మణపల్లి రైతువేదికలో శుక్రవారం ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కనకలక్ష్మి మాట్లాడుతూ.. మాడ్గుల మండలంలో సుమారు 1,000 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు కార్యచరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేందుకుగాను సలహాలు, సూచనలు ఇవ్వటానికి ప్రత్యేకంగా ఫీల్డ్ ఆఫీసర్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన రావడానికి రైతులకు డైరీనోట్‌లు అందజజేశారు. ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు 90 శాతం సబ్సిడీ మొక్కలు మరియు 80 శాతం డ్రిప్ ఇవ్వడం జరిగిందని వివరించారు. డ్రిప్‌కు మాత్రం ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీ మరియు 5 ఎకరాల్లోపు రైతులకు డ్రిప్ సబ్సిడీ 80 శాతం ఇవ్వడం జరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ గౌతమ్, ఏఈఓ జోస్న, రాజేష్, ఫీల్డ్ ఆఫీసర్ విక్రమ్, రెతులు పాల్గొన్నారు.

లెక్క చెప్పాల్సిందే..

- గ్రామాల్లో మొదలైన ఉపాధిహామీ పనుల తనిఖీలు
- క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందాలు
- 2023–24 ఏడాదికి గాను చేసిన పనులు, ఖర్చులపై ఆరా
- 25 నుంచి గ్రామసభలు, 30న మండల సభ



ఇంకుడుగుంత పనులకు కొలతలు తీస్తున్న సామాజిక తనిఖీ బృందం

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధి హామీ పనుల తనిఖీలు అధికారులకు వనుకు పుట్టిస్తున్నాయి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి జరగాల్సిన సామాజిక తనిఖీ ఈసారి ఆలస్యంగా జరుగుతోంది. ఈ తనిఖీల్లో ఇబ్రహీంపట్నం మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి చేపట్టిన ఖర్చులపై విచారణ చేపట్టనున్నారు. ఉపాధి హామి కూలీలకు చేసిన పనులు, ఖర్చు పెట్టిన నిధులు పై ఆరా తీయనున్నారు. ఇందు కోసం సామాజిక తనిఖీ బృందాలు ఇప్పటికే రికార్డులను స్వాధీనం చేసుకొని క్షుణ్ణంగా పరిశీలించే పనిలో పడ్డారు.

ప్రతీపైసాపై విచారణ..

ఇప్పటికే మండలంలో 16వ విడత సామాజిక తనిఖీ మొదలైంది. ఇందుకోసం తనిఖీ బృందాలు ఈ నెల 18వ తేదీ నుంచే గ్రామాలకు చేరుకున్నాయి. 01-04-2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 21-03-2024 వరకు పంచాయతీ రాజ్ రోడ్లు, సామాజిక అడవుల పెంపకం, కూలీలకు పని దినాలు కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.4,22,82,609 కోట్లు ఖర్చు చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలో ఉపాధి కూలీలకు రూ.1.35 లక్షల పనిదినాలు కల్పించారు. నాలుగు వేల కుటుంబాలు జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. వీరిలో 6వేల జాబ్‌కార్డులు యాక్టివ్‌గా పనిచేస్తున్నాయి. సామాజిక అడవులు పెంపకం కోసం పంచాయతీరాజ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు వేశారు. అలాగే కూలీలతో చెట్లపాదలు తొలగించడం, కందకాలు, ఇంకుడు గుంతలు తవ్వించడం వంటి పనులు కల్పించారు. ఈ పనులు గ్రామాల్లో సక్రమంగా చేశారా, నిధులు సకాలంలో ఖర్చు చేశారా దుర్వినియోగం చేశారా అని క్షేత్ర స్థాయిలో పనులు పరిశీలించడంతో పాటు పనులు చేసిన కూలీలను కలిసి వివరాలు సేకరించనున్నారు

25 నుంచి గ్రామసభలు..

ఈనెల 18వ తేదీ నుంచే సామాజిక తనిఖీ బృందాలు గ్రామాలకు చేరుకున్నారు. గ్రామాల్లో కూలీలు చేసిన పనులు కాంట్రాక్టర్ల ద్వారా వేసిన రోడ్లు, సామాజిక అడవుల పెంపకం పనులు పరిశీలించే పనిలో పడ్డారు. పరిశీలన అనంతరం ఈ నెల 25వ తేది నుంచి 14 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు పెట్టి ప్రజాక్షేత్రంలో పరిశీలిస్తారు. 30వ తేదీన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ గ్రామ, మండల సభల్లో పనులపై నివేదిక సమర్పిస్తారు. ఎలాంటి పొరపాట్లు ఉన్నా అక్కడే చదివి వినిపిస్తారు. గతంలో జరిగిన సామాజిక తనిఖీలపై మాట్లాడుతారు. ఎవరైనా అధికారులు అవినీతికి పాల్పడినా, నిధుల దుర్వినియోగానికి పాల్పడినా చర్యలు తీసుకుంటారు. దీంతో టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓ, కంప్యూటర్ ఆపరేటర్లు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల్లో వనుకు మొదలైంది.

తనిఖీలకు సహకరించాలి



ఉపాధి హామీపై జరుగుతున్న ఉపాధి తనిఖీకు కూలీలు, కాంట్రాక్టర్లు, అధికారులు సహకరించాలి. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు కూడా అందుబాటులో ఉండాలి. ఇప్పటికే వారికి కావాల్సిన ఏర్పాట్లు చేశాం. పూర్తిస్థాయిలో విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేలా నివేదిక అందజేయాలి.

– క్రాంతికిరణ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ, ఇబ్రహీంపట్నం

రికార్డులు అందజేశాం



ఉపాధి హామీ నిధులతో పంచాయతీ రాజ్ రోడ్లు వేశాం. మండల వ్యాప్తంగా చేసిన పనులపై ఎంబీ రికార్డులను పూర్తిస్థాయిలో తనిఖీ బృందాలకు ఇప్పటికే అందజేశాం. ఎక్కడ లోటుపాట్లు లేకుండా రికార్డులు పరిశీలన చేశాం. అందరూ సహకరిస్తే త్వరగా పూర్తి అవుతుంది. ఎక్కడ అవకతవకలు లేకుండా పనులు జరిపించాం. క్యూసీ రిపోర్టులు కూడా వచ్చాయి.

– ఇంద్రాసేనారెడ్డి, ఏఈ, ఇబ్రహీంపట్నం

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386